క్లుప్తంగా

9న బీఎన్‌రెడ్డి వర్ధంతి సభ



అర్వపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 9న జరిగే మాజీ ఎంపీ భీంరెడ్డి నర్సింహారెడ్డి 15వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ తుంగతుర్తి డివిజన్ ఇన్‌ఛార్జ్ ఈదురు వీరపాపయ్య కోరారు. ఆదివారం అర్వపల్లిలో సభ విజయవంతానికై కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సారెస్పీ రెండో దశకు మాజీ ఎంపీ బీఎన్ రెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వర్ధంతి సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏశబోయిన సుధీర్, వేముల నర్సయ్య, వి.రమేష్, ఆంజనేయులు, గణేష్, వెంకటేష్, నజీర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

నాగారం : మండల పరిధిలోని నర్సింహుల గూడెంలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నోముల వెంకటయ్య రోజు వారిగానే తన గేదెలను వ్యవసాయక్షేత్రంలోకి మేతకు తోలుకెళ్తున్నాడు. గేదె మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గేదెకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ గేదె విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు.

గుంజలూరులో రెండు గేదెలు మృతి

చివ్వెంల : విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గుంజలూరు గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పరాల రామమల్లుకు చెందిన పాడి గేదెలను మేత కోసం వ్యవసాయ పొలాల వద్దకు తొలుకెళ్లి మేపుతుండగా ఇటీవల తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. గేదెల విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపారు.

భారీగా తరలిన బీఎస్పీ శ్రేణులు

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగే తెలంగాణ భరోసా సభకు మండలం నుంచి బీఎస్పీ శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లాయి. వెళ్లినవారిలో జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు చెర్కుపల్లి లక్ష్మణ్, పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య, దడిపల్లి వెంకట్, సత్యం, వెంకన్న, బోజమ్మ, వెంకటమ్మ, వసంత, యశోద ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీల ఎన్నిక



మాట్లాడుతున్న ఈరేటి అంజయ్య

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి, లక్ష్మాపురం, డి.కొత్తపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్‌పార్టీ బూత్ కమిటీలను ఎన్నికల పరిశీలకులు యారాల నర్సింహారెడ్డి, ఈరేటి అంజయ్య, ఈదుల కిరణ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి బూత్‌కు ఇద్దరి చొప్పున బూత్ కన్వీనర్లను, ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మల్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, శీల గణేష్, సర్పంచ్ కుంటపల్లి సుధాకర్, గండెల శ్రీనివాస్, బొమ్మగాని నాగయ్య, సాగర్, నవీన్, మధు, నరేష్, గిరి, సోమలక్ష్మి, కొండయ్య, మట్టగజం వీరన్న, నాతి మహేష్, పడిశాల పెద్దలింగయ్య, సంపెట అశోక్, బెల్లి సైదులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు

పెన్‌పహాడ్ : మేడే వారోత్సవాలను మండల పరిధిలోని లింగాల గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కృష్ణ ఎర్రజెండాను ఎగురవేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ రద్దు అయ్యేంతవరకు కార్మిక వర్గం అలుపెరగని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు రణపంగ బుచ్చిరాములు, ఎస్‌కే అబ్బురు, రణపంగ సాలయ్య, మామిడి భిక్షం, బట్టిపల్లి ముత్తయ్య, లొడంగి మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో జెండా ఎగురవేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ

జీవనోపాధికి.. సరిహద్దులు దాటి!

- పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి ఉపాధి పొందుతున్న వలస కూలీలు
- తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 300 కుటుంబాలకు పైగానే..

అర్వపల్లి : పొట్టకూటి కోసం ఆ కూలీలు సరిహద్దులు దాటి.. పొరుగు రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చి వివిధ రంగాల నందు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గతకొన్నేళ్లుగా ఈ ప్రాంతంలోనే ఉంటూ కూలీ పనులు చేస్తూ పూట గడుపుకుంటున్నారు. బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి తుంగతుర్తి నియోజకవర్గానికి వందలాది కుటుంబాలు వచ్చి కూలీ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నాయి.



డి.కొత్తపల్లిలో ఇంటి నిర్మాణ పనుల్లో వివిధ రాష్ట్రాల కూలీలు

నియోజకవర్గంలో ఇలా..

తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, నాగారం, తుంగతుర్తి తదితర మండలాలకు ఆయా పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 300 కుటుంబాలకు పైగానే వలస వచ్చి ఇక్కడ కూలీ పనులు చేస్తున్నారు. ప్రధానంగా ఈ కూలీలు ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన మగ, ఆడ కూలీలు ఇక్కడ మేస్త్రీల కింద పనికి వెళ్తూ రోజుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకు రోజుకూలి సంపాదిస్తున్నారు. అయితే ఇక్కడి మేస్త్రీలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఉండటానికి వసతి కల్పిస్తూ పనులకు తీసుకెళ్తున్నారు. తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం, అర్వపల్లి తదితర ప్రాంతాల్లో పొరుగు రాష్ట్రాల కూలీలు ఉంటూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణ పనులకు వెళ్తున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు లేనప్పుడు వ్యవసాయ పనులకు కూడా పోతున్నారు. కాగా కొందరు రైస్ మిల్లులలో హమాలీలుగా పనిచేస్తున్నారు.

మహారాష్ట్ర నుంచి వచ్చి పనులకు వెళ్తున్నా



గత కొన్నేళ్లుగా మహారాష్ట్ర నుంచి తుంగతుర్తి నియోజకవర్గానికి కూలీ పనులకు వస్తున్నాం. కుటుంబాలతో కలిసి వచ్చి ఇక్కడే ఉండి పనులు చేసుకుంటున్నాం. అక్కడ సరైన ఉపాధి దొరక్క ఇక్కడికి వలస వచ్చి ఇళ్ల నిర్మాణ పనులకు భార్య భర్తలం వెళ్తున్నాం.

– రాజు, మహారాష్ట్ర

30 కుటుంబాలు పనిచేస్తున్నాయి



నేను కొంత కాలంగా సుతారి మేస్త్రీగా పనిచేస్తున్నా. వందల సంఖ్యలో ఇళ్లు నిర్మిస్తున్నా. ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులను కూలీల కొరత ఏర్పడుతుండటంతో వివిధ రాష్ట్రాలకు చెందిన 30 కుటుంబాలు నా దగ్గర పనిచేస్తున్నాయి. వారికి వసతి కల్పించి రోజు కూలి ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నా. నాకు వివిధ భాషలు రావడంతో వారితో వారి వారి భాషల్లో మాట్లాడుతూ పనులు చేయిస్తున్నా.

– మత్స్యగిరి, సుతారి మేస్త్రీ, కొత్తపల్లి, నాగారం మండలం

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



నూతనకల్‌లో ధాన్యం ఎగుమతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల్లో కాంటా నిర్వహించిన బస్తాలను త్వరితగతిన మిల్లులకు ఎగుమతి చేయాలని తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్ కోరారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



భానుపురి : మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

భానుపురి : అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షఫీఉల్లా, స్వామినాయుడు, చొక్కయ్య గౌడ్, సైదిరెడ్డి, వల్దాసు దేవేందర్ పాల్గొన్నారు.

నేడు నిరుద్యోగ బహిరంగ సభ

నాగారం : కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్‌లో జరిగే నిరుద్యోగ బహిరంగ సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు షేక్.హుస్సేన్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు భరోసా కల్పించేందుకు బహిరంగ సభకు ప్రియాంకగాంధీ హాజరవుతారని తెలిపారు. వరంగల్ డిక్లరేషన్ తరహాలో యూత్ డిక్లరేషన్ ప్రకటిస్తారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేపర్ లీకేజీలకు పాల్పడుతూ నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. ఈ సభకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆయనతోపాటు యూత్‌కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నూతనకల్ : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే నిరుద్యోగ జంగ్ సైరన్ సభకు మండల పరిధిలోని గ్రామాల నుంచి నిరుద్యోగులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జంగ్ సైరన్ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరవుతారని, సభలో యువతకు బాసటగా డిక్లరేషన్‌ను ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లెం కృష్ణారెడ్డి, మేడిపల్లి అశోక్, బొడ్డుపల్లి అంజయ్య, ముత్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో సోమవారం జరిగే నిరుద్యోగ నిరసన జంగ్ సైరన్ సభను జయప్రదం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి కోరారు. ఆదివారం అర్వపల్లిలో సభ జయప్రదానికై సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ హాజరయ్యే సభకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, దాసరి సోమయ్య, కృష్ణమూర్తి, మాదగాని విక్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలి



మద్దిరాల : గోరెంట్లలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్



తుంగతుర్తి : వెలుగుపల్లిలో మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మద్దిరాల : ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో జరిగిన శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు కన్న వీరన్నగౌడ్, గుడ్ల వెంకన్న, సూరినేని నర్సింహారావు, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, సర్పంచ్ దామెర్ల వెంకన్న, అమృతరెడ్డి, బద్దం సంజీవరెడ్డి, వద్దాణం మధుసూదన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామ సర్పంచ్ మామిడి వెంకన్న తండ్రి మామిడి శ్రీరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి ఆదివారం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సింగారం తండాకు చెందిన బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండల నాయకుడు పాతులోతు లాల్‌సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడటంతో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.25,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, నల్లు రామచంద్రారెడ్డి, పులుసు యాదగిరి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆదివారం మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి సభ్యుడు, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి పరామర్శించారు.అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, సర్పంచ్ ధనియాకుల కోటమ్మసత్యనారాయణ, రాచూరి ప్రతాప్, చిట్టెపు నారాయణరెడ్డి, నాగమ్మ, సైదులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సూర్యాపేట : పూర్వ విద్యార్థులతో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్



ఆత్మకూర్ (ఎస్) : పాతర్లపహాడ్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



మద్దిరాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



నూతనకల్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సూర్యాపేట : ఆనాడు నేతాజీ విద్యా మందిర్‌ను స్థాపించి నిరుపేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యా బోధన అందించిన ఫలితమే నేడు తనను ఈ స్థాయికి చేర్చిందని నేతాజీ విద్యా మందిర్ వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఆదివారం నేతాజీ విద్యా మందిర్ పాఠశాలకు చెందిన 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు తాళ్లగడ్డలో, 1998–99 పూర్వ విద్యార్థులు ట్రిపుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ దంపతులతో పాటు గురువులు వెస్లీ, వాణి, చంద్రకళ, విజయలక్ష్మి, భాను, నాగమణిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1998–99 పూర్వ విద్యార్థులు సంద్రపాటి రవి, పఠాని రవీందర్, ఊట్కూరి శ్రీనివాస్, రాపర్తి సతీష్, అనంతుల కిరణ్, పి.మోహన్, బైరు నాగేందర్, ఇరుగు కృష్ణ, అప్పల కిరణ్, సంధ్య, మాధవి, శ్వేత, కవిత, లక్ష్మి, 1995–96 పూర్వ విద్యార్థులు రాపర్తి సైదులు, రాపర్తి మహేష్, ఎస్.రవి, కాజా, వి.సైదులు, విష్ణు, భిక్షం, శ్రీను, వసంత, శ్రీలత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎస్) : మండల పరిధిలోని పాతర్లపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–2008 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, తెలంగాణ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ పున్నయ్య, నాటి ఉపాధ్యాయులు ఉస్మాన్, వెంకన్న, శ్రీహరి, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు సైదులు, పాండు, సుభాష్, మమత, సునీత, సుమిత్ర, సృజన, మహేష్ పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు పుల్లయ్య, రత్నయ్య, సోమయ్య, మల్సూర్ అలీ, పూర్వ విద్యార్థులు భూతం వెంకన్న, చలం, తులసీదాస్, శ్రవణ్, ఉపేందర్, శ్రీను, లింగయ్య, మాధవి, శ్రీదేవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండల పరిధిలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనాటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మె



నాగారంలో సమ్మె చేస్తున్న కార్యదర్శులు



అర్వపల్లిలో..

అర్వపల్లి : జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్యదర్శులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి, నారాయణమూర్తి, నెహ్రూ నాయక్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, జ్యోతి, మహాలక్ష్మి, ఫర్హాన, కావ్య, మాధవిక పాల్గొన్నారు.

నాగారం : జూనియర్ పంచాయతీ కార్యర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ కార్యదర్శులు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె ఆదివారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సంఘం మండల అధ్యక్షుడు కొమ్ము అరుణ్ మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, గడిచిన 4ఏళ్ల ప్రొబేషనరీ కాలన్ని సర్వీసు కాలంగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేపీఎస్‌లు శోభన్, వీరేందర్, భవాని, శ్రీనివాస్, సతీష్, వెంకటేష్, జిందగిరి, సంతోష్, శివ, అంబేద్కర్, గోపి పాల్గొన్నారు.

అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమాగం

- చెరువును తలపిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- తడిసిపాడైన వేలాది బస్తాల ధాన్యం

అర్వపల్లి : భారీ వడగళ్ల వర్షాలు అన్నదాతలను వెంటాడి ఆగమాగం చేస్తున్నాయి. గత 20 రోజుల నుంచి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే ఇటీవల కురిసిన అకాల, వడగళ్ల వర్షాలతో జిల్లాలో ఎక్కడ లేని విధంగా జాజిరెడ్డిగూడెం మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో వరిపంటలు పాడయ్యాయి. అలాగే 300 ఎకరాలకు పైగానే మామిడి, నిమ్మ తోటలు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉంటే శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం అర్వపల్లితోపాటు మండల వ్యాప్తంగా కురిసింది. దీంతో వివిధ గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలు చెరువులను తలపించేలా మారాయి. లోయపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం భారీ వర్షానికి బురద మడుగులా మారి ఈ కేంద్రంలోని సుమారు 14వేల బస్తాల ధాన్యం తడిసి ముద్దయింది. అలాగే కాసర్లపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా చెరువును తలపిస్తోంది. కొమ్మాలలో ఈదురుగాలికి మామిడి, నిమ్మ తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే తిమ్మాపురం–సంగెం రహదారిపై కోడూరు వద్ద వాగు పొంగి ప్రవహిస్తుండటంతో ఈ రహదారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వివిధ గ్రామాల కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి ధాన్యం కొట్టుకుపోయి రైతులు భారీగా నష్టపోయారు.



లోయపల్లిలో బురద మడుగులా మారిన ధాన్యం కొనుగోలు కేంద్రం

వంద బస్తాల ధాన్యం బురదమయం



లోయపల్లిలోని కొనుగోలు కేంద్రంలో అమ్మడానికి పోసిన వంద బస్తాల ధాన్యం భారీ వర్షానికి బురదమయంగా మారి నీళ్లలో కొట్టుకుపోయింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– పగడాల వెంకన్న, రైతు, లోయపల్లి



కాసర్లపహాడ్‌లో చెరువును తలపిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం



లోయపల్లి కేంద్రంలో బురదలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతు



కొమ్మాలలో మామిడితోటలో రాలిపోయిన మామిడి కాయలు

సంక్షిప్త సమాచారం

కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ తొలగింపు

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాల గ్రామం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నల్లబండగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్‌ను తొలగించారు. నాలుగు రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ కేంద్రాన్ని పరిశీలించగా.. ట్రక్‌షీట్‌లో ధాన్యం వివరాలు నమోదు చేయకపోవడాన్ని గమనించారు. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్‌ను తొలగించి మరొకరికి బాధ్యతలు అప్పగించారు.

గ్రామ పంచాయతీకి శవపేటిక అందజేత

నడిగూడెం: నడిగూడెం మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన సుంకర వెంకటనర్సమ్మ (55) ఇటీవల మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు ఆదివారం గ్రామపంచాయతీకి శవపేటిక ఫ్రీజర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్, వెంకటనర్సమ్మ కుటుంబ సభ్యులు వెంకటేశ్వర రావు, ప్రవీణ్‌బాబు, గ్రామ పెద్దలు పాలడుగు ప్రసాద్, సుబ్బారావు, అర్జున్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ



విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న పల్లె మణిబాబు

సూర్యాపేటటౌన్ : బాలభవన్ వేసవి శిక్షణ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ ఎక్స్‌పర్ట్ పల్లె మణిబాబు ఆదివారం హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ ఇంప్రూవ్ చేసుకునే మెళకువలు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న వయసు నుంచే చేతిరాత ప్రాముఖ్యతను గుర్తించి శ్రద్ధ పెడితే పైచదువుల్లో ఇబ్బందులు ఉండవని, పిల్లల్లో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరుగుతుందన్నారు. అనంతరం పల్లె మణిబాబును శిక్షణ నిర్వాహకులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి, ఎల్లయ్య, సింగ్, ఉమా, అనిల్, సాయి వీరు, పద్మ, సునీత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



గణపవరంలో పూర్ణకుంభంతో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

కోదాడరూరల్ : ఆలయాల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గల శ్రీవరవర రంగనాయక స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో గల పురాతన ఆలయాలను పునఃప్రతిష్ఠించుకొని వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన పూర్ణకుంభంతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనతంరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా కవితారాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, సర్పంచ్ పొట్టా శ్రీవిజయకిరణ్, ఆలయ కమిటీ చైర్మన్ కామిశెట్టి నర్సింహారావు, ముడియాల వెంకట్‌రెడ్డి, నరసింహారావు, మధు, రాంబాబు, కొండలు, జైపాల్ తదితరులున్నారు.

కేసీఆర్ హయాంలోనే ఆలయాలకు పూర్వ వైభవం

నడిగూడెం : సీఎం కేసీఆర్ హయాంలోనే దేవాలయాలకు పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం నడిగూడెం మండల పరిధిలోని వెంకట్రాంపురంలో నిర్వహించిన ధ్వజస్తంభ మహోత్సవం, ముత్యాలమ్మ, కనకదుర్గ, శ్రీఆంజనేయ ఆలయాల ప్రారంభంం వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తుమ్మగూడెంలో బొడ్రాయి ప్రతిష్ఠ

మోతె: మండల పరిధిలోని తుమ్మగూడెం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, అదేవిధంగా బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సిరెడ్డి, ఉపసర్పంచ్, టీఆర్ఎస్ నాయకులు శీలం సైదులు, ఆరె లింగారెడ్డి, వెంకటేశ్వరరావు, మద్ది మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.